




# EVENING EDITION

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

4PM

www.suryaa.com

గురువారం

09 మే 2024

పేజీలు: 02





## పాయింట్స్ టేబుల్

| టీమ్ | ఆడినవి | గెలిచినవి | ఓడినవి | రన్ రేట్ | పాయింట్స్ |
|---|---|---|---|---|---|
| కోల్‌కతా | 11 | 8 | 3 | 1.45 | 16 |
| రాజస్తాన్ | 11 | 8 | 3 | 0.47 | 16 |
| హైదరాబాద్ | 12 | 7 | 5 | 0.40 | 14 |
| చెన్నై | 11 | 6 | 5 | 0.70 | 12 |
| ఢిల్లీ | 12 | 6 | 6 | -0.31 | 12 |
| లక్నో | 12 | 6 | 6 | -0.76 | 12 |
| బెంగళూరు | 11 | 4 | 7 | -0.04 | 8 |
| పంజాబ్ | 11 | 4 | 7 | -0.18 | 8 |
| ముంబై | 12 | 4 | 8 | -0.21 | 8 |
| గుజరాత్ | 11 | 4 | 7 | -1.32 | 8 |

## నేటి మ్యాచ్

పంజాబ్ X బెంగళూరు

ధర్మశాల, రా.7.30

### హైదరాబాద్ నుంచి గుంటూరుకు లారీలో
## తరలిస్తున్న రూ.8.40 కోట్లు సీజ్

ఎన్నికల నేపథ్యంలో పోలీసులు ముమ్మర తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఎన్టీఆర్ జిల్లాలో భారీగా నగదు పట్టుబడింది. జగ్గయ్యపేట మండలం గరికపాడు చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేపట్టిన పోలీసులు.. లారీలో తరలిస్తున్న రూ.8.40 కోట్లను సీజ్ చేశారు. నగదును హైదరాబాద్ నుంచి గుంటూరుకు తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



### రేపే అక్షయ తృతీయ..
## ఇలా చేస్తే లాభమట!

రేపటి నుంచి అక్షయ తృతీయ ప్రారంభం కానుంది. అక్షయ అంటే తరగనిధి అని అర్థం. ఆ రోజున బంగారం కొంటే లాభం కలుగుతుందని చాలామంది భావిస్తారు. అయితే అక్షయ తృతీయ నాడు బంగారం, వెండి కొనాలని ఏ పురాణంలోనూ లేదట. ఆరోజు దానం చేస్తే పుణ్యం వస్తుందట. జలదానం, అన్నదానం, వస్త్ర దానం చేస్తే దారిద్ర్య బాధలు ఉండవని పండితులు చెబుతున్నారు.





### డొనాల్డ్ ట్రంప్ చిన్న కుమారుడి
## రాజకీయ రంగ ప్రవేశం

అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చిన్న కుమారుడు బారన్ ట్రంప్ రాజకీయ రంగ ప్రవేశం చేయనున్నారు. 'రిపబ్లికన్ నేషనల్ కన్వెన్షన్'కు ఫ్లోరిడా నుంచి ప్రతినిధిగా పంపనున్నట్లు పార్టీ ఛైర్మన్ ఇవన్ పవర్ బుధవారం వెల్లడించారు. నవంబర్‌లో జరగనున్న అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున డొనాల్డ్ ట్రంప్ పోటీ చేయనున్న విషయం తెలిసిందే. ఆయన ఎంపికను అధికారికంగా ధ్రువీకరించేందుకు జులైలో పార్టీ కన్వెన్షన్ జరగనుంది. దీనికి ఫ్లోరిడా నుంచి 41 మంది ప్రతినిధులు వెళ్లనున్నారు. వారిలో బ్యారన్ ట్రంప్ ఒకరని పవర్ వెల్లడించారు. బ్యారన్ ట్రంప్ ఇప్పటి వరకు బయటి ప్రపంచానికి దూరంగా ఉంటూ వచ్చారు. మార్చితో ఆయనకు 18 ఏళ్లు రానున్నాయి. వచ్చే వారమే హైస్కూల్ నుంచి గ్రాడ్యుయేట్ కానున్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు డొనాల్డ్ ట్రంప్‌నకు కోర్టు అనుమతి ఇచ్చింది. ఆయన ప్రస్తుతం 'హష్‌మనీ కేసు'లో విచారణ ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. మరోవైపు ట్రంప్ ఇతర వారసులైన డొనాల్డ్ ట్రంప్ జూనియర్, ఎరిక్ ట్రంప్, చిన్న కుమార్తె టిఫనీ సైతం పార్టీ తరఫున ఫ్లోరిడా ప్రతినిధులుగా వ్యవహరించనున్నారు. పార్టీ కన్వెన్షన్ విస్కాన్సిన్‌లోని మిల్వాకీ నగరంలో జులై 15-18 మధ్య జరగనుంది.

India Post Payments Bank
Aapka bank, aapke dwaar.

### భారీ జీతంతో IPPBలో
## ఎగ్జిక్యూటివ్ పోస్టులు

ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ (IPPB) ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. 54 పోస్టులకు గానూ అర్హులైన అభ్యర్థులు మే 24 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు. బీఈ/బీటెక్ లేదా బీసీఏ/బీఎస్సీ లేదా ఎంసీఏ ఉత్తీర్ణత అయి ఉండాలి. ఎంపికైన అభ్యర్థులకు రూ.25 లక్షల వరకు వార్షిక వేతనం చెల్లించనున్నారు. పూర్తి వివరాల కోసం https://ippbonline.com ను చూడగలరు.

### ముస్తాబైన కేదార్ నాథ్ ఆలయం..
## రేపు తెరచుకోనున్న
# గుడి తలుపులు

కేదార్ నాథ్ ఆలయం ముస్తాబైంది. రేపే ఆలయ తలుపులు తెరచుకోనున్నాయి. 40 క్వింటాళ్ల పూలతో ఆలయాన్ని అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య జ్యోతిర్లింగ క్షేత్రమైన కేదార్‌నాథ్ ఆలయ తలుపులు తెరవనున్నారు. ఈ విషయాన్ని బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ ఛైర్మన్ అజేంద్ర అజయ్ తెలిపారు. చార్‌ధామ్ యాత్రలో భాగంగా కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలను మే 10వ తేదీన ఉదయం 7 గంటలకు తెరవనున్నట్లు ఆయన చెప్పారు.ఈ నేపథ్యంలో అక్కడ ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆలయాన్ని 40 క్వింటాళ్ల పూలతో సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు. 12 జ్యోతిర్లింగాల్లో కేదార్‌నాథ్ ఆలయం ఒకటి. పరమేశ్వరుడి పవిత్ర ఆలయాలంగా చెబుతారు. చార్‌ధామ్ యాత్రలో కేదార్ నాథ్ దేవాలయం సందర్శన భాగంగా ఉంటుంది. ఏటా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షల మంది భక్తులు కేదార్‌నాథ్‌కు చేరుకుని పరమేశ్వరుడ్ని దర్శించుకుంటారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తుంటారు. అయితే ఏటా శీతాకాలం ప్రారంభం కాగానే ఈ ఆలయాన్ని మూసివేస్తారు. మంచు కారణంగా ఆలయాన్ని మూసేస్తారు. శీతాకాలంలో దాదాపు ఆరు నెలల పాటు ఈ ఆలయ తలుపులు మూసే ఉంటాయి. ఆ సమయంలో ఆలయం మొత్తం మంచుతో కప్పకుపోయి ఉంటుంది. తిరిగి వేసవిలో ఈ ఆలయ తలుపులు తిరిగి తెరుస్తారు. కాగా.. ఇప్పటికే చార్ధామ్ యాత్రలో భాగంగా రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. పర్యటనక శాఖ అందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసింది. హరిద్వార్, రిషికేశ్‌లలో మే 8న ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్లు మొదలయ్యాయి. భక్తుల సౌకర్యార్థం ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం ధర్మనగరిలోనూ ఆరు కౌంటర్లు ఏర్పాటు చేశారు. కేంద్రాల్లో నమోదుకు ఇంటర్నెట్ సౌకర్యం, లైట్, విద్యుత్‌తో పాటు ప్రయాణికులు కూర్చునేందుకు కుర్చీలు, నీరు తదితర ఏర్పాట్లను చేశారు. వీటిపై ఒక్కో ధామ్‌కు 500 మంది యాత్రికుల పేర్లను నమోదు చేస్తారు. ధర్మనగరిలోని పర్యాటక శాఖ కార్యాలయ ఆవరణలోనూ ఆరు కౌంటర్లను ఏర్పాటు చేశారు. బద్రీనాథ్, కేదార్‌నాథ్, యమునోత్రి, గంగోత్రి ధామ్ యాత్రికుల కోసం ఐదు వందల స్లాట్లు బుక్ చేసుకోవచ్చు.





## నష్టాల్లో స్టాక్ మార్కెట్

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం నష్టాలతో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాలు మన సూచీలను ప్రభావితం చేస్తున్నాయి. ఉదయం 9:28 గంటల సమయంలో సెన్సెక్స్ 145 పాయింట్ల నష్టంతో 73,321 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 31 పాయింట్లు కుంగి 22,271 దగ్గర కొనసాగుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.83.47 వద్ద ప్రారంభమైంది. సెన్సెక్స్-30 సూచీలో ఎం అండ్ ఎం, మారుతీ, టాటా మోటార్స్, ఎస్‌బీఐ, హెచ్‌సీఎల్ టెక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఇన్ఫోసిస్, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. ఎల్ అండ్ టీ, టెక్ మహీంద్రా, టీసీఎస్, ఎన్‌టీపీసీ, ఐటీసీ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, సన్‌ఫార్మా, నెస్లే ఇండియా, బజాజ్ ఫిన్‌సర్వ్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి.



### అమెరికా ఆరోపణల వేళ
## భారత్‌కు రష్యా మద్దతు

భారత వ్యక్తుల ప్రమేయంతో తమ గడ్డపై గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు కుట్ర జరిగిందన్న అమెరికా ఆరోపణలపై రష్యా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మారియా జఖరోవా స్పందించారు. 'ఇప్పటివరకు మాకు అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. ఈ కేసుకు సంబంధించి వాషింగ్టన్ నమ్మదగిన సాక్ష్యాలను ఇంతవరకు అందించలేదు. తగిన ఆధారాలు లేనప్పుడు ఈ అంశంపై ఊహాగానాలు చేయడం ఆమోదయోగ్యం కాదు' అని అన్నారు.

### తండేల్ నుండి ఆకట్టుకుంటున్న
## సాయి పల్లవి వీడియో!


టాలీవుడ్ యంగ్ హీరో నాగ చైతన్య ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ ఎంటర్టైనర్ తండేల్. చందూ మొండేటి దర్శకత్వం లో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో సాయి పల్లవి కథానాయికగా నటిస్తుండగా, గీతా ఆర్ట్స్ బ్యానర్ పై ఈ చిత్రం ను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం పై ప్రేక్షకుల్లో, అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే ఈ చిత్రం నుండి రిలీజైన ప్రచార చిత్రాలకి ప్రేక్షకుల నుండి మంచి స్పందన లభించింది. నేడు సాయి పల్లవి పుట్టిన రోజు సందర్భంగా మేకర్స్ ఒక స్పెషల్ వీడియోను రిలీజ్ చేశారు. తండేల్ మూవీ చిత్రీకరణ లో సాయి పల్లవి డిఫెరెంట్ ఎమోషన్స్ తో కూడుకున్న వీడియో అది. నటిగా తన పెర్ఫార్మెన్స్ ఈ చిత్రం లో ఎలా ఉండబోతుంది అనే విషయం వీడియోను చూస్తే తెలుస్తుంది. నాగ చైతన్య.మరియు సాయి పల్లవి కాంబినేషన్ లో వచ్చిన లవ్ స్టోరీ చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ గా నిలవడం తో ఈ చిత్రం పై ప్రేక్షకుల్లో, అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని డిసెంబర్ 20, 2024న థియేటర్ల లో రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.



### ఇన్వర్టర్లు, జనరేటర్లు, పవర్ బ్యాంకులు..
## ఇవే కాంగ్రెస్ 6 గ్యారంటీలు
### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



రాష్ట్రంలో కరెంటు ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు పోతుందో తెలియడం లేదు. ఎండలు మండిపోతుండటంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడుతన్న వేళ ఎడాపెడా విద్యుత్ కోతలు విధిస్తున్నారు. రాష్ట్రంలో డిమాండ్‌కు సరిపోయినంతగా విద్యుత్ సరఫరా అవుతుందని కాంగ్రెస్ సర్కార్ చెబుతున్నప్పటికీ కరెంటు కోతలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ప్రభుత్వంపై సెటైర్లు వేశారు. ప్రజలంతా ఇన్వర్టర్లు, చార్జింగ్ బల్బులు, క్యాండిళ్లు, జనరేటర్లు, పవర్ బ్యంకులు, టార్చిలైట్లు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఇవే కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇది బీఆర్ ప్రభుత్వం కాదని.. కాంగ్రెస్ సర్కార్ అని గుర్తుంచుకోవాలన్నారు. మే 13న ఆలోచించి ఓటు వేయాలని చెప్పారు.




### సిబ్బంది మూకుమ్మడి సెలవులు..
## 30 మందిపై సంస్థ వేటు


టాటా గ్రూప్ ఆధ్వర్యంలోని ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లో నెలకొన్న వివాదం రోజురోజుకూ ముదురుతోంది. సిబ్బంది మూకుమ్మడి సెలవులతో సుమారు 100 విమానాలను ఎయిరిండియా సంస్థ రద్దు చేసిన విషయం తెలిసిందే. దీంతో సెలవులు పెట్టి విమాన సేవలకు అంతరాయం కల్పించిన వారిపై సంస్థ తాజాగా చర్యలకు ఉపక్రమించింది. సుమారు 30 మంది సిబ్బందిపై సంస్థ వేటు వేసింది.ఈ మేరకు బుధవారం రాత్రి 30 మంది సిబ్బందికి సంస్థ తొలగింపు నోటీసులు పంపినట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. సర్వీస్ రూల్స్ ఉల్లంఘించిన కారణంగా తక్షణమే వారిని విధుల నుంచి తొలగిస్తున్నట్లు సంస్థ నోటీసుల్లో పేర్కొంది. సరైన కారణం లేకపోయినా కావాలనే సెలవు పెట్టారని, ముందస్తు ప్రణాళిక ప్రకారమే ఇదంతా చేశారని ఉద్యోగులకు పంపిన నోటీసుల్లో సంస్థ పేర్కొంది. సంస్థ యాజమాన్య విధానాలను నిరసిస్తూ అనారోగ్య కారణాలతో 200 మందికిపైగా క్యాబిన్ సిబ్బంది ఒకేసారి సెలవు పెట్టిన విషయం తెలిసిందే. దీంతో ఏకంగా 100కి పైగా దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దు చేయాల్సి వచ్చింది. షెడ్యూల్ ప్రకారం విధులకు హాజరు కావాల్సిన సిబ్బంది చివరి నిమిషంలో సిక్ లీవ్ పెట్టడంతోనే ఈ సమస్య ఉత్పన్నమైందని తెలిపారు.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# సల్మాన్ సికందర్‌లో హీరోయిన్‌గా రష్మిక!

గతేడాది బాలీవుడ్ స్టార్ హీరో రణబీర్ కపూర్ ప్రధాన పాత్రలో నటించిన అనిమల్ చిత్రం లో ఫీమేల్ లీడ్ రోల్ లో నటించింది రష్మిక మందన్న. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఇప్పుడు ఈ హీరోయిన్ మరొక బాలీవుడ్ భారీ చిత్రం లో హీరోయిన్ గా ఎంపిక అయ్యింది. బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ ప్రధాన పాత్రలో, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ ఏఆర్ మురగదాస్ దర్శకత్వం లో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్టైనర్ సికందర్. నడియద్వాలా గ్రాండ్‌సన్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై సాజిద్ నదియద్వాలా నిర్మిస్తున్న ఈ చిత్రం పై ప్రేక్షకుల్లో, అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం ను అనౌన్స్ చేసినప్పటి నుండి సినిమాపై ఆసక్తి నెలకొంది. ఈ చిత్రం లో రష్మిక ఫీమేల్ లీడ్ రోల్ లో నటించనుంది. ఇదే విషయాన్ని మేకర్స్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఈ ఛాన్స్ రావడం పట్ల రష్మిక సంతోషం వ్యక్తం చేస్తోంది.





## కాంగ్రెస్, బిఆర్ఎస్, మజ్లిస్ పార్టీలది
# ట్రయాంగిల్ బంధం

### అమిత్ షా

కాంగ్రెస్, బిఆర్ఎస్, మజ్లిస్ పార్టీలది ట్రయాంగిల్ బంధం అన్నారు కేంద్రమంత్రి అమిత్ షా. లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ భువనగిరి లోక్‌సభ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్‌కు మద్దతుగా యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహించిన బీజేపీ ఎన్నికల ప్రచారంలో అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఎన్నికలు ఓట్ ఫర్ జిహాద్, ఓట్ ఫర్ అభివృద్ధి మధ్య జరుగుతున్న ఎన్నికలని అమిత్ షా అన్నారు. కుటుంబ అభివృద్ధి, దేశవ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధికి మధ్య జరుగుతున్న పోరు అని , రాహుల్ పిల్ల చేష్టల హామీలు, మోదీ గ్యారంటీ మధ్య జరుగుతున్న ఎన్నికలని పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీ 2019 ఎన్నికల్లో నాలుగు సీట్లు గెలిచింది. కానీ ఈసారి 10 సీట్లు గెలవబోతున్నామని తెలిపారు. మూడు విడతల్లో ఇప్పటికే 200 సీట్లు గెలిచామని, మిగిలిన దశల్లో మొత్తం 400 సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ముస్లింలకు 4% రిజర్వేషన్ ఇవ్వడంతో షెడ్యూల్ కులాలు, తెగల వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు అమిత్ షా చెప్పారు. ఈ నేపథ్యంలో బీజేపీకి రాష్ట్రంలో పది సీట్లు ఇస్తే ముస్లింల రిజర్వేషన్ తొలగించి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు ఇస్తామని అన్నారు. అంతేకాదు రాష్ట్రంలో రాహుల్ బాబా ఇచ్చిన రుణమాఫీ హామీ ఇప్పటివరకు అమలు కాలేదని అన్నారు. కాంగ్రెస్ వాగ్దానాలు ఎప్పటికీ అమలు చేయదని, కానీ ప్రధాని మోదీ చెప్పింది తప్పక అమలు చేస్తారని హోం మంత్రి పేర్కొన్నారు. రాహుల్ గాంధీ గ్యారంటీలు చెల్లే పరిస్థితి లేదు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అమలు కాలేదు. రైతులకు ఏటా రూ.15 వేల ఆర్థికసాయం అమలు చేయలేదు. రైతు కూలీలకు ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం నెరవేర్చలేదు. వరి, గోధుమలకు రూ.500 బోనస్ హామీ అమలు చేయలేదు. రైతులకు పూచీ లేకుండా రూ.5 లక్షల రుణ హామీ నెరవేరలేదు. ప్రతి మండలంలో అంతర్జాతీయ పాఠశాల హామీ నెరవేర్చలేదు. కాంగ్రెస్ చేసిన వాగ్దానాలను ఎన్నటికీ నెరవేర్చదు అన్నారు. ఆర్టికల్ 370ని తొలగించి కశ్మీర్‌లో త్రివర్ణ పతాకం ఎగరేలా చేశామని షా అన్నారు. మోదీ ఉగ్రవాదం, తీవ్రవాదం వంటి వాటిని రూపుమాపి మావోయిస్టు సిద్ధాంతాలు లేకుండా చేస్తున్నారని హోంమంత్రి పేర్కొన్నారు. అసలు తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఓవైసీని నిలువరించగలవా అని షా ప్రశ్నించారు. ఈ క్రమంలో ఏబీసీ అనే పదాలకు కొత్త అర్థాలు చెప్పారు. ఏ అంటే అసదుద్దీన్, బీ అంటే బీఆర్ఎస్, సీ అంటే కాంగ్రెస్ అని అమిత్ షా వెల్లడించారు.

# ఐపీఎల్‌లో చరిత్ర సృష్టించిన హైదరాబాద్




సొంత గడ్డపై హైదరాబాద్ ఎప్పటికీ మరిచిపోలేని అద్భుతమైన విజయాన్ని అందుకుంది. లఖ్‌నవూను 10 వికెట్ల తేడాతో చిత్తుగా ఓడించి ప్లే ఆఫ్స్‌కు మరింత చేరువైంది. తొలుత బ్యాటింగ్ చేసిన లఖ్‌నవూ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 165 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని హైదరాబాద్ ఓపెనర్లిద్దరే 9.4 ఓవర్లలోనే ఉఫ్‌మని ఊదేశారు. ట్రావిస్ హెడ్ (89*; 30 బంతుల్లో 8 ఫోర్లు, 8 సిక్స్‌లు), అభిషేక్ శర్మ (75*; 28 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్స్‌లు) ఊచకోతతో ఉప్పల్ స్టేడియం ఊర్రూతలూగింది. ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ పలు రికార్డులు నమోదు చేసింది. ఐపీఎల్ చరిత్రలో 160 కంటే పైచిలుకు స్కోరును అత్యంత వేగంగా ఛేదించిన తొలి జట్టుగా హైదరాబాద్ రికార్డు సృష్టించింది. టోర్నీలో ఒక మ్యాచ్‌లో మొదటి 10 ఓవర్లలో అత్యధిక పరుగులు (167) చేసిన జట్టుగానూ అవతరించింది. తర్వాత రెండు స్థానాల్లోనూ (దిల్లీపై 158/4), (ముంబయిపై 148/2) హైదరాబాదే ఉంది. ఒక సీజన్‌లో పవర్ ప్లేలో రెండుసార్లు 100 కంటే ఎక్కువ పరుగులు చేసిన తొలి జట్టుగా హైదరాబాద్ నిలిచింది. ఒక ఐపీఎల్ ఎడిషన్‌లో అత్యధిక సిక్స్‌లు (146 సిక్సర్లు.. 12 మ్యాచ్‌ల్లో) బాదిన జట్టుగా హైదరాబాద్ ఆరెంజ్ ఆర్మీ రికార్డును సొంతం చేసుకుంది.



# ఒకప్పుడు అన్న కోసం పాదయాత్ర చేశా... ఇప్పుడు న్యాయం కోసం నిలబడ్డా

### వైఎస్ షర్మిల

ఎంపీగా అవినాష్‌రెడ్డి కడప స్టీల్ ప్లాంట్ కోసం ఒక్క ఉద్యమం కూడా చేయలేదని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. పులివెందులలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడారు. "హత్యలు చేయడానికే అధికారం వాడుకుంటున్నారు. అవినాష్ నిందితుడని సీబీఐ చేసిన ఆరోపణల ప్రకారమే మాట్లాడుతున్నాం. కాల్ రికార్డ్స్ , గూగుల్ మ్యాప్స్ వంటి ఆధారాలన్నీ ఉన్నాయి. బాబాయిని చంపిన హంతకులనే సీఎం కాపాడుతున్నారు. జగన్‌కు అధికారమిచ్చింది ఆయన్ను కాపాడటానికేనా? ఒకప్పుడు అన్న కోసం పాదయాత్ర చేశా... ఇప్పుడు న్యాయం కోసం నిలబడ్డా. న్యాయం గెలుస్తుందా? నేరం గెలుస్తుందా? అని ప్రపంచమంతా చూస్తోంది. కడప ప్రజలు న్యాయాన్ని గెలిపించాలని కోరుతున్నా" అని షర్మిల అన్నారు.


రేపోమాపో అవినాష్‌రెడ్డి జైలుకు: సునీత

తన తండ్రిని దారుణంగా హతమార్చారని మాజీ మంత్రి వివేకా కుమార్తె సునీత అన్నారు. న్యాయం కోసం పోరాడుతున్నామని చెప్పారు. ఈ పోరాటంలో కోర్టు తీర్పు చాలా ఆలస్యం కావొచ్చన్నారు. ప్రజా తీర్పు పెద్దదని.. దానికోసం షర్మిల ఎంపీగా పోటీ చేస్తున్నారని చెప్పారు. "వైఎస్ అవినాష్‌రెడ్డి రేపో మాపో జైలుకు పోతారు. జైలుకు పోయేవారు కాదు.. జనాల్లో ఉండేవాళ్లు రావాలి. షర్మిలను గెలిపించి వివేకా ఆత్మకు శాంతి కలిగించండి" అని సునీత కోరారు.




## విజయ్ నెక్స్ట్ మూవీ
# ప్రీ లుక్ పోస్టర్స్

నేడు విజయ్ దేవరకొండ పుట్టిన రోజు సందర్భంగా మరొక ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ కి సంబంధించిన అఫీషియల్ అనౌన్స్ మెంట్ వచ్చింది. రాజా వారు రాణిగారు చిత్రం ను డైరెక్ట్ చేసిన రవి కిరణ్ కోల దర్శకత్వం లో విజయ్ దేవరకొండ నటించనున్నారు. ఈ చిత్రానికి SVC59 అనే టైటిల్ ను తాత్కాలికం గా పెట్టడం జరిగింది. ప్రముఖ నిర్మాణం సంస్థ అయిన శ్రీ వేంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు శిరీష్ లు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇదే విషయాన్ని వెల్లడించడానికి సరికొత్త ప్రీ లుక్ పోస్టర్ ను విడుదల చేసారు. పోస్టర్ లో డైలాగ్ కూడా ఉంది. కత్తి నేనే...నెత్తురు నాదే...యుద్ధం నాతోనే. ఈ చిత్రం తెలుగు తో పాటుగా, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో కూడా రిలీజ్ కానుంది.




# లష్కరే కమాండర్ సహా ముగ్గురు ముష్కరులు హతం

జమ్ముకశ్మీర్‌లోని కుల్గాంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతయ్యారు. వారిలో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ మోస్ట్‌వాంటెడ్ టెర్రరిస్టులు, లష్కరె తొయిబా కమాండర్ ఉన్నారని ఇండియన్ ఆర్మీ వెల్లడించింది. ఉగ్రవాదులు ఉన్నారనే విశ్వసనీయ సమాచారంతో సోమవారం రాత్రి కుల్గాంలోని రెద్వాని పయీన్ ప్రాంతంలో భద్రతా బలకాలు గాలింపు ప్రారంభించాయి. సుమారు 40 గంటలపాటు సాగిన ఆపరేషన్ బుధవారం రాత్రి ముగిసింది. ఈసందర్భంగా ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టామని భారత సైన్యానికి చెందిన చినార్ కార్ప్స్ ఎక్స్ వేదికగా వెల్లడించింది. ఘటనా స్థలంలో ఆయుధ సామాగ్రి స్వాధీనం చేసుకున్నామని తెలిపింది.

